సాక్షి మెదక్

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



పురుగు చావదు..

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రూరల్‌లో కల్తీ ఎరువులు.. పురుగు మందులు.. రైతుల గుండెల్లో కలవరం సృష్టిస్తున్నాయి.

వివరాలు 8లో ▸



భూమి పూజ అడ్డగింత

స్థల వివాదంతో అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా పంచాయతీ భవన నిర్మాణ భూమి పూజను గ్రామస్తులు అడ్డుకున్నారు.

వివరాలు 8లో ▸

నేడు రామాయంపేటకు మంత్రి

మెదక్ మున్సిపాలిటీ: మంత్రి హరీశ్‌రావు సోమవారం రామాయంపేటకు రానున్నట్లు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మహిళా అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో రూ.7లక్షలతో ఐకేపీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.. సమావేశాలు నిర్వహించుకోవడానికి సరైన స్థలం లేక మహిళలు ఇబ్బంది పడేవారని, ఈ భవన నిర్మాణం పూర్తయితే ఆ బాధలు ఉండవని పేర్కొన్నారు. అనంతరం రెడ్డి సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాబు, సహకార సంఘం డైరెక్టర్ శంకర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లింగారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శివ్వంపేట విద్యార్థి



క్రికెట్‌లో రాణిస్తున్న యువరాజ్, చందన

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శివ్వంపేట విద్యార్థి ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుని శనివారం పటాన్‌చెరువులో ఎంపిక చేశారు. అండర్- 17 విభాగంలో శివ్వంపేటకు చెందిన విద్యార్థి యువరాజ్ ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంతో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. వచ్చే నెలలో గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననుంది. యువరాజ్ చెల్లెలు చందన సైతం మహిళా క్రికెట్ జట్టుకు అదనపు ప్లేయర్‌గా ఎంపికైంది.

వినూత్న నిరసన



సమ్మెలో పంచాయతీ ఆపరేటర్లు

మెదక్ కలెక్టరేట్: డిమాండ్ల సాధన కోసం జిల్లాలోని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు 3వ రోజు ఆదివారం శాంతియుత సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని వేడుకుంటూ నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలన్నారు. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, కారుణ్య నియామకాలు, పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్‌గౌడ్, సాయికుమార్, హరీశ్ కుమార్, నామ లక్ష్మణ్, రామస్వామి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని..



నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు దేవమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రంగనాయక సాగర్ అద్భుతం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధి చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను ఆదివారం ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు సందర్శించారు. రిజర్వాయర్ బండ్, పంప్ హౌస్‌ను పరిశీలించారు. రిజర్వాయర్ విస్తీర్ణం, సాగులోకి వచ్చే భూమి, పంపింగ్ విధానం ఏఈ ఖాజా మ్యాప్ ద్వారా వివరించారు. రిజర్వాయర్ నిర్మాణం అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా చాగంటి కితాబిచ్చారు.





ఏడుపాయలలో భక్తుల సందడి, (ఇన్‌సెట్) అమ్మవారికి టీఎస్‌పీఎస్ సభ్యురాలు సుమిత్ర ఆనంద్ పూజలు

దుర్గమ్మా.. దీవించమ్మా..

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గ క్షేత్రం జనసంద్రంగా మారింది. ఆదివారం సింగూరు నీటి ప్రవాహం తగ్గడంతో దుర్గమ్మ ఆలయ దర్శనాన్ని పునరుద్ధరించారు. ఆలయాన్ని శుద్ధి చేసిన అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీఎస్‌పీఎస్ సభ్యురాలు సుమిత్రా ఆనంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం, బోనాలు, తల నీలాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి ఉన్నారు.





చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్) దైవ సందేశమిస్తున్న చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు దఫాలుగా ప్రార్థనలు చేశారు. చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య భక్తులను ఉద్దేశించి దైవ సందేశమిచ్చారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మైనంపల్లి చేరిక.. హస్తంలో కాక

డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పార్టీకి గుడ్‌బై

- త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రచారం
- వెంటరాని అనుచరులు!

మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్ చేరికతో కాంగ్రెస్‌లో కాకా రేపింది. మెదక్ టికెట్ మైనంపల్లి రోహిత్ కు ఇస్తారన్న ప్రచారమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మెదక్ సీటును డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మొదటి నుంచి ఆశిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మైనంపల్లి రాకతో పార్టీలో అనూహ్యంగా మార్పులు చోటుచేసుకున్నాయి. టికెట్ దక్కదన్న సంకేతాలు రావడంతో జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి కంఠారెడ్డి రాజీనామా చేశారు. దీంతో జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. – మెదక్



కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

మెదక్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన మైనంపల్లి రోహిత్, హన్మంతరావులకు కాంగ్రెస్‌లో రెండు టికెట్లు ఇస్తామని హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఢిల్లీ పెద్దల సమక్షంలో వారిద్దరూ హస్తం పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం శ్రమించారు. అధిష్టానం ఆదేశాల మేరకు ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేవారు. అధికార పార్టీ చేసే ప్రజావ్యతిరేక విధానాన్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహాన్ని నింపారు. క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన తిరుపతిరెడ్డి మెదక్ అసెంబ్లీ టికెట్ తనకే వస్తుందనే ధీమాలో ఇన్నిరోజులు ఉన్నారు. తీరా మైనంపల్లి రోహిత్‌కే మెదక్ టికెట్ ఇస్తారనే సంకేతాలు రావటంతో తిరుపతిరెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో డీసీసీ అధ్యక్ష పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి ఆదివారం రాజీనామా చేశారు.

ప్రచార రథం కూడా సిద్ధం చేసుకున్నారు

మొదట మెదక్ అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డికే ఇస్తున్నామని పీసీసీ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆయన ప్రచార రథాన్ని సైతం సిద్ధం చేసుకున్నారు. డీసీసీ కార్యాలయం వద్ద షెడ్డు నిర్మించి ఎన్నికలు అయిపోయే వరకు వంటావార్పు ఇక్కడేనని, ఎన్నికలు ముగిసే వరకు 24 గంటలపాటు కార్యకర్తలు ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరు మాసాల వరకు కావాల్సిన కిరాణా సరుకులు సైతం కొనుగోలు చేసి పెట్టారు. చివరికి మెదక్ టికెట్ మైనంపల్లి రోహిత్‌కు ఇస్తారనే ప్రచారం జరగటంతో నిరాశతో తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పాడు.

ఒక నిఖార్సైన కాంగ్రెస్ కార్యకర్తగా ఇలాంటి పరిణామాలను జీర్ణించుకోలేక, చూస్తూ పార్టీలో ఉండ లేక, బరువెక్కిన గుండెతో పార్టీని వీడటం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. మనోవేదనతో ఈ నా రాజీనామా లేక ద్వారా మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి, కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీలో ఇనాళ్ల నాకు అన్ని విధాలుగా సహకరించిన వారందరికీ ధన్యవాదములు'' అంటూ తిరుపతి రెడ్డి తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

నోట్ల కట్టలకు టికెట్లు

''పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కష్టపడి పని చేస్తున్న తన లాంటి కార్యకర్తలకు స్థానం లేదనే విషయం అర్థమైంది. కేవలం డబ్బు సంచులే ప్రాతిపదికగా జరుగుతున్న పార్టీ టికెట్ల కేటాయింపులపై నేను తీవ్రమైన మనోవేదనకు లోనయ్యాను. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తులకు నాయకత్వం అప్పగించడంతో, వారి చేతిలో పార్టీ బందీ అయ్యింది. అలాంటి వారి నాయకత్వంలో పార్టీకి మనుగడ లేదు. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో పార్టీ పుంజుకుంటుందని నాలాంటి అనేకమంది కాంగ్రెస్ కార్యకర్తలు భావించారు. కేవలం డబ్బు సంచులు కలిగిన నాయకులకే సీట్లు అప్పగించడం కాంగ్రెస్ మోడలని ప్రజలు విశ్వసించేలా పరిణామాలు ఉన్నాయి.'' అని కంఠారెడ్డి తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

ఫలించిన హరీశ్‌రావుతో భేటీ!

మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన అనంతరం కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో చర్చలు జరిపారు. తనకు మల్కాజ్‌గిరి, తన కొడుకు రోహిత్‌కు మెదక్ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి ఢిల్లీ పెద్దలు సానుకూలంగా స్పందించారు. దీంతో ఈ నెల 25న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్, మధుయాష్కీగౌడ్‌లు హైదరాబాద్‌లోని మైనంపల్లి హన్మంతరావు ఇంటికి వెళ్లి చర్చించారు. అనంతరం మైనంపల్లి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బృందం తనను పార్టీలోకి ఆహ్వానించిందని, ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ముఖ్యనేత రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో (సెప్టెంబర్ 28న) కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. ఆదేరోజు మెదక్ డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి సైతం ఢిల్లీ వెళ్లి.. ఇన్నాళ్లపాటు పార్టీ కోసం పని చేసిన తన పరిస్థితి ఏంటని అడిగాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ ఇస్తామని సర్దిచెప్పినట్లు సమాచారం. కాగా, ఆ మరుసటి రోజే తిరుపతిరెడ్డికి మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేసి బీఆర్‌ఎస్‌లోకి రావాలని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. హరీశ్ వ్యూహం ఫలించి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారని తెలిసింది.

ఒంటరిగా కంఠారెడ్డి..!

డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పార్టీకి రాజీనామా చేయడంపై నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు, నాయకులు స్పందించారు. తాము కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేస్తామని, ఎవరితో వెళ్లమని స్పష్టం చేశారు. కొన్నేళ్లపాటు పార్టీని, క్యాడర్‌ను కాపాడిన తిరుపతిరెడ్డి పార్టీని అకస్మాత్తుగా వీడటం తమకు బాధగా ఉన్నా, తాము మాత్రం పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.

త్వరలో బీఆర్‌ఎస్‌లోకి..?

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తిరుపతిరెడ్డి త్వరలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనునట్లు తెలిసింది. ఆయన పార్టీకి రాజీనామా చేసేముందు తమతో ఎలాంటి సంప్రదింపులు చేయలేదని పలువురు పేర్కొన్నారు. కాగా ఇన్నాళ్లపాటు తను క్యాడర్‌తో కలిసి పనిచేసిన తిరుపతిరెడ్డి వెంట ఇంకెవరైనా వెళ్తారా..? లేదా ఒక్కరే వెళ్తారా అనేది తెలియాల్సి ఉంది.



వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

వృద్ధులు దేవుళ్లతో సమానం

కలెక్టర్ రాజర్షి షా

నర్సాపూర్ రూరల్: వయోవృద్ధులు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వృద్ధులు దేవుళ్లతో సమానమన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఓల్డ్ ఏజ్ హోమ్ వృద్ధులకు తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. వీరికి ఓటర్ ఐడీ ఉండేలా చూడాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఈసారి వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తుందన్నారు. అనంతరం ఓల్డ్ ఏజ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, ఆర్‌ఐలు సిద్ధిరాంరెడ్డి, ఫైసల్, విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలు అపర్ణరెడ్డి, ముక్తాబాయ్, సురేందర్, సళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

5న సఖీ సెంటర్ ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: సఖీ సెంటర్‌లో మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ఆదివారం మెదక్‌లో నిర్మిస్తున్న సఖీ సెంటర్ భవనాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 5న మంత్రి హరీశ్‌రావు సెంటర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో శ్రమదానం

హాజరైన జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ మున్సిపాలిటీ: ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 స్వచ్ఛత హి సేవ, అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మెదక్ కోర్టు ఆవరణలో జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద పాల్గొని శ్రమదానం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఏక్ తారీక్ ఏక్ గంట ఏక్ సాత్ అనే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన శ్రమదాన కార్యక్రమాన్ని జిల్లా జడ్జి లక్ష్మీశారద స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి, చెత్తను ఏరివేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చందు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కల్పన, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకీరాంతోపాటు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్ రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.అనిత సూచించారు. ఆదివారం నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటి కాలుష్య నియంత్రణకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాలకృష్ణ, న్యాయవాదులు, ఖాజా మొయినుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, కంది ప్రకాష్, స్వరూప రాణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

రావి ఆకుపై మహాత్ముడు

మనోహరబాద్(తూప్రాన్): గాంధీ జయంతి సందర్భంగా ఓ ఉపాధ్యాయుడు రావి ఆకుపై మహాత్ముని చిత్రపటాన్ని గీసి శుభాకాంక్షలు తెలియజేశాడు. మండల కేంద్రం మనోహరబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారి రావి ఆకుపై గాంధీ చిత్రపటాన్ని చక్కగా చిత్రీకరించాడు. దీనిని చూసిన పలువురు అధికారులు అభినందించారు.

రావి ఆకుపై గీసిన గాంధీ చిత్ర పటం



కేసీఆర్‌ను ఓడించేవారు పుట్టలేదు

- ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం
- ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీయే గెలుస్తుందని, కేసీఆర్‌ను ఓడించేవారు ఇంతవరకు పుట్టలేదని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెదక్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన మూడో విడత బీసీ బంధు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 300మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో కరెంట్, సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపింది సీఎం కేసీఆర్ ఒక్కరేనని తెలిపారు. 24గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు వంటి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. బీసీబంధు నిరంతర ప్రక్రియ ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ముందు, చేసుకోని వారికి తరువాత తప్పకుండా పథకం వర్తిస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో మభ్యపెట్టేందుకు జిమ్మిక్కులు చేస్తుంటారని వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని అధికారులతో ఓపెనింగ్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, బీసీ సంక్షేమ అధికారి శంకర్ నాయక్, అసిస్టెంట్ అధికారి నాగరాజు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జెడ్పీవైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

క్లుప్తంగా

ఉత్సాహంగా 5కే రన్ శిక్షణ



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటజోన్: మనిషి జీవితంలో వాకింగ్, రన్నింగ్, యోగ ఒక భాగంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. స్థానిక నెక్లెస్ రోడ్ వద్ద సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత 5కే రన్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ మన ఒక గంట మనం మన ఆరోగ్యం కోసం ఆలోచిస్తే ఆసుపత్రికి వెళ్లే అవసరం ఉండదని చెప్పారు. వచ్చే ఏడాది ఆగస్టులో హాఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ 10 వేల మందితో ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేద్దామన్నారు. అందుకు సిద్దిపేట ప్రజలు ఇప్పటి నుంచే ప్రాక్టీసు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, ప్రతినిధులు రాజు, రాజిరెడ్డి, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

4న ఎస్సీ ఉపకులాల ఆత్మీయ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మోచి సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎస్సీ ఉపకులాల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లేమ్ ప్రభాకర్, ఉమ్మడి జిల్లా కోశాధికారి బైరి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బహిరంగ సభకు చెందిన కరపత్రాలను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఎస్సీలలోని ఉపకులాల పట్ల చిన్నచూపు తగదని, ఉపకులాలకు అసెంబ్లీలో 6 స్థానాలను కేటాయించడంతో పాటు దళితబంధులో 40 శాతం, గృహలక్ష్మీ పథకంలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 4న హైద్రాబాద్‌లో జరిగే ఈ సభకు అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్, కొమురం భీం మనుమడు సోనేరావు భీంలు హాజరవుతున్నారని చెప్పారు. ఎస్సీ 57 ఉపకులాల హక్కుల సాధన కోసం పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోచి సంఘం గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు రవి, సభ్యులు వేణుగోపాల్, శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిలో అర్చకుల శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరానికి హాజరైన అర్చకులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచారంగుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో ఆదివారం ధూప దీప నైవేద్య అర్చకుల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అర్చకులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలిరోజు వీరశైవ, శైవ ఆగమ అభ్యర్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఝరాసంగం ప్రధానాచార్యులు శివప్రసాద్ స్వామి, బడంగ్‌పేట ప్రధానాచార్యులు జగదీశ్వరస్వామి, అర్చక సంఘ ప్రతినిధి త్రిగుళ్ల గోపాలకృష్ణశర్మ, నాచారం గుట్ట వేద పండితులు నాగబాల కామేశ్వరశర్మ అర్చన సంబంధ అంశాలు వివరించారు. దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, నాచగిరి ఏసీ అన్నపూర్ణ, ఇన్‌స్పెక్టర్ రంగారావు కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించారు.



పైరు పెరగదు..

- కలవర పెడుతున్న కల్తీ ఎరువులు
- యూరియాకు అదనంగా రూ.50 వసూలు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- గుట్టుగా సాగుతున్న విక్రయాలు

జిల్లాలో కల్తీ ఎరువులు.. పురుగు మందులు.. రైతుల గుండెల్లో కలవరం సృష్టిస్తున్నాయి. రోజురోజుకూ రసాయన ఎరువులు, పురుగు మందులు కంపెనీలు వేలల్లో పుట్టుకొస్తున్నాయి. అసలే వేటిని వాడాలో తెలియక సతమతమయ్యే రైతులపై ఈ కల్తీ మందులు మరింత కలకలం సృష్టిస్తున్నాయి. రైతులు తమ శ్రమకు తగ్గ దిగుబడి పొందాలని ఆశపడతారు. ఆ ఆశని కల్తీ మందుల వ్యాపారులు ఆసరాగా తీసుకుంటున్నారు. మోసాలకు గురిచేస్తున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

హుస్నాబాద్‌రూరల్: దిగుబడి మంచిగా ఉండాలని, పైరు ఏపుగా పెరగాలని రైతులు ఎరువుల దుకాణంలో దొరికే రకరకాల రసాయన మందులు కొనుగోలుచేసి పంటలకు స్ప్రే చేస్తుంటారు. ఆయనా పురుగు చావదు.. పైరు పెరగదు. తమ లాభాల కోసం కొందరు ఫర్టిలైజర్ షాపుల యాజమానులు రైతులకు మాయమాటలు చెప్పి అనుమతి లేని కల్తీ రసాయన మందులను అమ్మిసొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. నకిలీ రసాయన ఎరువులు దుకాణంలో కన్పించవు.. కాని రహస్య ప్రదేశాల నుంచి తెచ్చి రైతులకు ఇస్తారు. రసాయన ఎరువుల నాణ్యత గురించి తెలియని రైతులు వాటిని వాడి నష్ట పోతున్నారు. నకిలీ రసాయన పురుగు మందుల వాడకం వల్ల ఆర్థిక భారంతో పాటు పంట కూడా నష్టపోతున్నారు. దానికి తోడు వర్షాల అదనుచూసి వ్యాపారులు యూరియాను బ్లాక్‌చేసి బస్తాకు రూ.50లు అదనంగా తీసుకుని గుట్టుగా విక్రయిస్తున్నారు. రైతులకు సేవలు అందించాల్సిన ఆగ్రో, రైతుమిత్ర కేంద్రాలు కూడ యూరియాలోడు రాకముందే బస్తాలు అయిపోయినట్లు చెప్పి తమను మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో మిరప రైతులు..

హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతులు ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, వరి సాగు చేస్తుంటారు. రెండేళ్లుగా పత్తి పంట ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో రైతులు పత్తిని తగ్గించి మిర్చి పంట సాగుకు మొగ్గు చూపించారు. చాలా చోట్ల మిరప సాగుచేశారు. అయితే పంటకు ముడుత, పురుగు ఎక్కువగా ఆశించింది. ఎరువుల మందుల వ్యాపారులు దీనిని ఆసరాగా చేసుకుని వారికి నకిలీ రసాయన ఎరువులను అంటగడతున్నారు. వాటిని ఎంత స్ప్రే చేసినా పురుగు చావడం లేదని, పైరు ఎదుగడం లేదని రైతులు ఆందోళ చెందుతున్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు..

పంటల సీజన్‌లో రైతుల ఎలాంటి పంటలు సాగుచేస్తున్నారు. వాటికి ఆశించే తెగుళ్లు, వాడవలసిన మందుల గురించి అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాని వ్యవసాయ అధికారులు ఆ దిశగా దృష్టి సారించినట్టు ఎక్కడా కనిపించడంలేదు. అలాగే ఎరువుల వ్యాపారులు విక్రయించే రసాయన మందులు, వాటి నాణ్యత ప్రమాణలను తనిఖీచేసి రైతులకు సూచనలు చేయాల్సిన బాధ్యత అధికారుల పై ఉంది. కాని వారు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించడంతో వ్యాపారులు నాసిరకం రసాయన మందులు తెచ్చి రైతులకు అంటకడుతున్నారు. వాటి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల హుస్నాబాద్‌లో ఏర్పడిన యూరియా కొరత వల్ల బస్తాకు అదనంగా రూ.50లు వసూలు చేసిన విషయంపై తనిఖీలు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నకిలీ మందులకే పైసలు పోవట్టే..



వానలు పడితే వరికి యూరియా అవసరం ఉంటది. లారీ నుంచి బస్తాలు దించక ముందే యూరియా అయిపోయినట్లు చెప్పవట్టే. నా పక్కపొంటి నర్సయ్య హన్మకొండ రోడ్డు ఫర్టిలైజరు దుకాణంకు పోతే బస్తాకు రూ.50లు అదనంగా తీసుకొని నాలుగు బస్తాలు ఇచ్చిండ్రు. నేను మిపర తోటకు ఇప్పటికే రూ.10 వేల మందులు కొట్టినా పురుగు చస్తలేదు.. ముడుత పోతలేదు.. ఏ మందు కొట్టినా ఏం లాభం లేదు నకిలీ మందులకే పైసలు పోవట్టే.

– జనగామ సంపత్‌రావు, రైతు, గాంధీనగర్

రాష్ట్రంలో 5.20 లక్షల మందికి పింఛన్లు

- ఆసరా ఇచ్చే కేసీఆర్‌ను ఆశీర్వదించాలి
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 5.20 లక్షల మందికి పింఛన్లు, దివ్యాంగులకు ప్రతి నెలా రూ.4,016ల పింఛన్ అందజేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వాదించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్ కోరారు. పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగులకు రూ.200, రూ.300ల పింఛన్ మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో కరువుతో ఆకలి చావులు, ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్లు ఉండేవన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరంతో పాటు గోదావరి నదిపై 5 ప్రాజెక్టులను నిర్మించి గోదావరి జలాలను తెచ్చిన అపర భగీరథుడు కేసీఆర్ అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో మెట్ట నేల పచ్చని పైర్లతో కళకళలాడుతోందని, 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. అలాగే పదివేల మందికి మెడికల్ సీట్లు వచ్చాయన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ అర్హత ఉన్నవారికి ధృవీకరణ పత్రాలు అందిస్తామని చెప్పారు. గృహలక్ష్మీ పథకంలో 5శాతం ఇండ్లను కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు భూక్య మంగ, గీకురు రవీందర్, ఎంపీపీలు లకావత్ మానస తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న కాశీనాథ్

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలు

అల్లాదుర్గం(మెదక్): ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దగలమని దక్షిణ మధ్యరైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్ అన్నారు. చేవెళ్ల గ్రామంలో ఆదివారం జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని చెప్పారు. ఇళ్ల ఎదుట, వీధులలోను చెత్త పడవేయవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ లింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతిచెందిన సునీల్

శివ్వంపేట(నర్సాపూర్): సర్వీస్ వైర్ తొలగించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన ఒక యువకుడు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల కొత్త కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుమ్మడి సునీల్(25) అదే కాలనీకి చెందిన బాల్‌రాజ్‌గౌడ్ కల్లు దుకాణంకు సంబంధించి సర్వీస్ వైర్ తొలగించమని సునీల్‌తో చెప్పడంతో అతను సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ బంద్‌చేసి స్తంభం పైకి ఎక్కాడు. సర్వీస్ వైర్ తొలగిస్తున్న క్రమంలో అదే స్తంభంపై ఉన్న మరో విద్యుత్‌లైన్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. సనీల్ తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

కనిపించకుండా పోయి..



భాస్కర్‌రావు (ఫైల్)

నర్సాపూర్‌రూరల్: కాలకృత్యాలు తీర్చుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైన ఘటన నర్సాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ మొగల్తూరుకు చెందిన నొంద్రు భాస్కర్‌రావు(50) తన కుటుంబంతో నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకొని వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. నర్సాపూర్ రాయరావు చెరువులో ఆదివారం అతడి మృతదేమం లభ్యమైంది. భాస్కర్ కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అందుబాటులోకి వెయ్యి పడకల ఆస్పత్రి

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- ప్రారంభానికి సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



ప్రారంభానికి సిద్ధమైన ఆస్పత్రి భవనం

సిద్దిపేటకమాన్: వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో 28 ఏకరాల విస్తీర్ణంలో నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించేందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆదివారం ఆమె పరిశీలించారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్ ఆసుపత్రిలో కల్పించిన వసతులు, వివిధ విభాగాల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వెయ్యి పడకల ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఆసుపత్రి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావడంతో ప్రజలకు అతి త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. ఆసుపత్రిలో బెడ్స్, ఫర్నీచర్, విభాగాల వారిగా వైద్యులు, వైద్య సిబ్బంది, పరికరాలు, తాగునీరు, వాష్ రూంలు, విద్యుత్ సరఫరా వంటివి సక్రమంగా ఉండేటట్టు చూడాలని టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజనీర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండాలని, ప్రతి డిపార్ట్‌మెంట్ సులభంగా అర్థమయ్యే విధంగా ప్రతి గదికి నెంబర్లు, పేర్లతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంఈ రమేష్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఈ రాజేందర్‌కుమార్, ఎస్ఈ సురేందర్‌రెడ్డి, డీఈ విశ్వప్రసాద్, ఈఈ శ్రీనివాస్, మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీని ఆదివారం ప్రారంభించారు. అనంతరం భూంపల్లి మండల కేంద్రంలోని 94 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలతో పాటు పద్మశాలి సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబ్బాక ప్రజానీకం అవకాశం ఇస్తే సిద్దిపేట, గజ్వేల్ తరహాలోనే మరింత బిన్నంగా దుబ్బాకను తీర్చిదిద్దుతానన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కార్యక్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేలేటి రాధాకృష్ణ శర్మ, ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజను అడ్డుకున్న గ్రామస్తులు



నిలిచిన పంచాయతీ భవన నిర్మాణం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా పంచాయతీ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థల ఎంపికలో ఏర్పడిన వివాదం ఆదివారం ఘర్షణకు దారితీసింది. గ్రామ పంచాయతీ భవనాన్ని కేశనాయక్‌తండాలోనే నిర్మించాలని, క్రీడా ప్రాంగణం పక్కన నిర్మిస్తే తాము ఒప్పుకోబోమని కొన్ని రోజులుగా ఆ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సర్పంచ్ రవీందర్ క్రీడా ప్రాంగం పక్కన పంచాయితీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేయడాన్ని కేశనాయక్‌తండా ప్రజలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో భవన నిర్మాణం క్రీడాప్రాంగణం పక్కన నిర్మించొద్దని విన్నవించారు. దీంతో భవనం ఎక్కడ నిర్మించాలో తర్వాత తెలియజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ రవీందర్ చెప్పారు.

చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

ములుగు(గజ్వేల్): తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి మహిళ చాకలి ఐలమ్మ చేసిన సేవలు చిరస్మరణీయం అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. ములుగు మండలం మామిడ్యాల ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరురాలు ఐలమ్మ అని, ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో 70 వేల రజక కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సాయుధ ఉద్యమ సమయంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలు మరువ లేనివని గుర్తు చేశారు. కారక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ నాగరాణి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గజ్వేల్‌రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమ్మెలో భాగంగా ఆదివారం స్థాని క అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదని, పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ర్యక్రమంలో వెంకటచారి, బాల్‌లక్ష్మీ, బాసయ్య, భాగ్యమ్మ, లక్ష్మీ, అమృత, యాదమ్మ దితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



మహేశ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): మద్యానికి బానిసై, ఆర్థిక ఇబ్బందుల వల్ల తీవ్రంగా మనస్తాపం చెందిన ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోల మహేశ్(25) కొంత కాలంగా మద్యం సేవించి కుటుంబీకులతో గొడవ పడుతుంటేవాడు. ఈ క్రమంలో మహేశ్ శనివారం తన భార్య కృష్ణవేణితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపొమ్మనగా ఆమె తన పుట్టింటికి వెళ్లింది. మహేశ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. విషయం గమనించిన స్థానికులు మహేశ్‌ను మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌రూరల్ పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

7 గంటల పాటు నిరసన



శ్రీకాంత్ ఇంటి ఎదుట బైఠాయించిన ప్రశాంత్ కుటుంబ సభ్యులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పందిల్ల గ్రామ సమీపంలో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీ..కొన్న ఘటనలో అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన పెండ్యాల ప్రశాంత్ మృతి చెందాడు. అయితే నూనె శ్రీకాంత్ ఢీ..కొట్టడంతోనే ప్రశాంత్ మృతి చెందాడని కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు శ్రీకాంత్ ఇంటి ఎదుట ప్రశాంత్ మృతదేహంతో ఆందోళన చేశారు. దేళ్లలోపు పిల్లలు ఉన్నారని, న్యాయం చేయాలని నిరసిస్తూ ఏడు గంటలపాటు నిరసన తెలిపారు. శ్రీకాంత్ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో కరీంనగర్‌లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో పెద్దమనుషుల సమక్షంలో సోమవారం మాట్లాడుకుందామని గ్రామస్తులు నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

అనారోగ్యంతో ఆటో డ్రైవర్..



చిరంజీవి (ఫైల్)

మనోహరాబాద్/వెల్దుర్తి(తూప్రాన్): అనారోగ్యానికి తోడు మద్యానికి బానిసైన ఓ ఆటోడ్రైవర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం వెల్దుర్తి మండలం మెల్లూర్ గ్రామానికి చెందిన పిట్ల చిరంజీవి(31) కొంతకాలంగా ఫిట్స్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఆటో నడపడం, చిన్నచిన్న పనులకు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యానికి తోడు మద్యానికి బానిసై ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పెళ్లి కావడంలేదని.. రైలు కింద పడి...



జంగం సాగర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట రైల్వేగేట్ సమీపంలో అదే గ్రామానికి చెందిన జంగం సాగర్ (27) ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పెళ్లి కావడంలేదని బెంగ పెట్టుకున్న సాగర్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్‌ఐ నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.